మంచిని చెవుల చెప్పి.. చెడును మైకుల చెప్తరా?

- పార్టీ సీనియర్లపై సీఎం రేవంత్‌రెడ్డి బహిరంగ ఫిర్యాదు
- కేంద్రం నుంచి రావాల్సినన్ని నిధులు వస్తలేవని వ్యాఖ్య

హైదరాబాద్, ఫిబ్రవరి 28 (నమస్తే తెలంగాణ): కొంతమంది కాంగ్రెస్ పార్టీ పెద్దలు చెడును మైక్‌లో చెప్తూ.. మంచిని మాత్రం చెవిలో చెప్తున్నారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఇది పార్టీకి, ప్రభుత్వానికి ఏమాత్రం మంచిది కాదని హెచ్చరించారు. ఆ మేరకు శుక్రవారం గాంధీభవన్‌లో శుక్రవారం టీపీసీసీ విస్తృతస్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశానికి కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల కొత్త ఇంచార్జి మీనాక్షి నటరాజన్ తొలిసారి హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి పార్టీ సీనియర్ నేతల మీద బహిరంగంగా మీనాక్షి నటరాజన్‌కు ఫిర్యాదు చేశారు. 'మంచిని మైకులో. చెడును చెవిలో చెప్పాలి. కానీ మనవాళ్లు చెడును మైకులో చెప్తున్నారు.. మంచిని చెవుల చెప్తున్నరు. ఇది పార్టీకి ఏమాత్రం లాభాన్ని తెచ్చిపెట్టదు. పార్టీకి, ప్రభుత్వానికి తీవ్రమైన నష్టాన్ని తెచ్చిపెడుతుంది. సమావేశంలో ఉన్న పెద్దలందరికీ నా సూచన ఒక్కటే. మంచి మైకులో చెప్పండి.. చెడును చెవిలో చెప్పండి. ఆ చెడును ఎట్లా సరిదిద్దుకోవాల్నో ఆలోచిద్దాం' అని అన్నారు.

ఏపీలో రిజర్వేషన్లు రద్దు చేసే దమ్ముందా?

సమావేశం అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడిన రేవంత్‌రెడ్డి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిపై తీవ్ర ఆరోపణలు చేశారు. కిషన్‌రెడ్డి అడ్డుపడటం వలనే తెలంగాణలో మెట్రోకు అనుమతి రాలేదని, మూసీ ప్రక్షాళన నిలిచిపోయిందని ఆరోపించారు. అభివృద్ధికి ఆయన సైంధవ పాత్ర పోషిస్తున్నారని విమర్శించారు. భావోద్వేగాలను రెచ్చగొట్టి, రాజకీయ ప్రయోజనాలు పొందాలని చూస్తున్నారా..? అని ఈ సందర్భంగా సీఎం కిషన్‌రెడ్డిని ప్రశ్నించారు. బీజేపీ, ఎన్డీయే పాలిత రాష్ట్రాల్లో బీసీ ఉపకులాల జాబితాలో ముస్లిం మైనార్టీలు ఉన్నారని, ఏపీలో బీసీ మైనార్టీలకు ఇస్తున్న రిజర్వేషన్లు రద్దు చేసే దమ్ము కేంద్రానికి ఉందా? అని ప్రశ్నించారు. మంత్రి కిషన్‌రెడ్డి కేంద్రం నుంచి ఒక్క రూపాయి కూడా తేవడం లేదని, ఒక్క ప్రాజెక్టు తీసుకురాలేదని ఆరోపించారు. కేంద్రానికి మనం రూపాయి చెల్లిస్తే.. మనకు కేంద్రం 42 పైసలు ఇస్తున్నదని పేర్కొన్నారు.

ఇదేంది ఛోటేభాయ్!

- కేంద్రం, మోదీపై సీఎం రేవంత్ మండిపాటు
- మోదీ గుజరాత్ నుంచి నోట్ల కట్టలు పంపడంలేదు
- టీపీసీసీ భేటీలో సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు

హైదరాబాద్, ఫిబ్రవరి 28 (నమస్తే తెలంగాణ): ప్రధాని మోదీ తనకు బడే భాయ్ అని, తెలంగాణ అభివృద్ధి చెందాలంటే గుజరాత్ మోడల్‌ను అనుసరించాలని వ్యాఖ్యానించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అకస్మికం కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్‌గాంధీ బీజేపీకి, ఎన్డీయే ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడుతుంటే.. గత ఏడాది ఆదిలాబాద్ సభలో మోదీతో అలాయ్‌బలాయ్ తీసుకున్న రేవంత్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడబోనని ప్రకటించారు. ఐదు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ అనే ప్రధానమంత్రి కలను నెరవేర్చడంలో తెలంగాణ చేతులు కలపాలని కోరుకుంటున్నదని చెప్పారు. అప్పటినుంచి ఇద్దరి మధ్య బంధం పెరుగుతూనే వచ్చినట్టు కాంగ్రెస్ శ్రేణులు చెప్తున్నాయి.

మారిన వైఖరి

తాజాగా టీపీసీసీ విస్తృతస్థాయి సమావేశంలో రేవంత్‌రెడ్డి తన సహజ ధోరణికి భిన్నంగా ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిపై విరుచుకుపడటం కాంగ్రెస్ శ్రేణుల్లో ఆశ్చర్యం కలిగిస్తున్నది. మూసీకి నిధులు అడిగితే అవహేళన చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. సబర్మతిని, గంగానదిని, యమునా నదిని వాళ్లు ప్రక్షాళన చేయొచ్చు కానీ తాము మూసీని ప్రక్షాళన చేయొద్దా అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి ఇలా కేంద్రానికి వ్యతిరేకంగా మాట్లాడటం మీనాక్షి నటరాజన్ ప్రభావమేనని కాంగ్రెస్ శ్రేణులు అనుకుంటున్నాయి.

కిషన్‌రెడ్డి తెలంగాణకు చేసిందేంటి?

బహిరంగ లేఖ ద్వారా సీఎం రేవంత్‌రెడ్డి ప్రశ్న

హైదరాబాద్, ఫ్రిబవరి 28 (నమస్తే తెలంగాణ): కేంద్రం నుంచి తెలంగాణకు ప్రాజెక్టుల మంజూరులో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి చొరవ చూపాలని సీఎం రేవంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు బహిరంగ లేఖ రాశారు. హైదరాబాద్ మెట్రో విస్తరణపై ఏడాదిగా విజ్ఞప్తి చేసినా పురోగతి లేదని మండిపడ్డారు. ప్రాజెక్టుల గురించి ప్రస్తావిస్తే మమ్మల్ని అడిగి హామీలు ఇచ్చారా అని కిషన్‌రెడ్డి విమర్శించడమేంటని ఆగ్రహం వ్యక్తంచేశారు. తెలంగాణ నుంచి కేంద్రమంత్రివర్గంలో ఉన్న కిషన్‌రెడ్డి రాష్ట్రానికి చేసిందమిటో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు.

రేవంత్‌కు చెక్ పెట్టేందుకేనా?

- మీనాక్షి నటరాజన్ నియామకంపై పార్టీలో తీవ్ర చర్చ సీఎం పనితీరుపై అధిష్ఠానానికి వరుస ఫిర్యాదులు
- పభుత్వంలో, పార్టీలో ఒంటెత్తు పోకడలపై సీనియర్ల గుర్రు
- ఇప్పటికే రేవంత్‌రెడ్డిని దూరం పెట్టిన రాహుల్‌గాంధీ
- పూర్తిగా చెక్ పెట్టేందుకే తన నమ్మకస్తురాలని పంపారని చర్చ



మీనాక్షితో సీఎం రేవంత్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్

హైదరాబాద్, ఫిబ్రవరి 28 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డికి చెక్ పెట్టేందుకే కాంగ్రెస్ అధిష్ఠానం మీనాక్షి నటరాజన్‌ను రంగంలోకి దింపిందా? పార్టీ పరంగా, పాలనాపరంగా రేవంత్‌రెడ్డి ఒంటెద్దు పోకడలను నియంత్రించేందుకే ఆమెను నియమించారా? సీనియర్ల వరుస ఫిర్యాదులతో రాహుల్‌గాంధీకి వాస్తవాలు బోధపడి మీనాక్షిని తెలంగాణకు పంపించారా? ప్రస్తుతం రాష్ట్ర కాంగ్రెస్ పార్టీలో తీవ్రంగా చర్చించుకుంటున్న అంశాలు ఇవి. దీపాదాస్ మున్షీని అర్థంతరంగా తప్పించి రాహుల్‌గాంధీకి అత్యంత సన్నిహితురాలు, నమ్మకస్తురాలైన మీనాక్షి నటరాజన్‌ను రంగంలోకి దింపడంపై అటు కాంగ్రెస్‌లో ఇటు రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చ జరుగుతున్నది. ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డిని రాహుల్‌గాంధీ పక్కన పెట్టారని, అందుకే ఢిల్లీకి ఎన్నిసార్లు వెళ్లినా కనీసం అపాయింట్‌మెంట్ ఇవ్వడం లేదని చెప్పుకుంటున్నారు. ఇప్పుడు రేవంత్‌రెడ్డిని పూర్తిగా నియంత్రించాలన్న లక్ష్యంతోనే తన నమ్మకస్తురాలిని తెలంగాణకు పంపారని గుసగుసలు వినిపిస్తున్నాయి.

వరుస ఫిర్యాదులు.. వరుస ప్లాపులు

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన మొదటి రోజు నుంచే సీఎం రేవంత్‌రెడ్డిపై అధిష్ఠానానికి సీనియర్లు ఫిర్యాదులు చేయడం మొదలు పెట్టారు. మొదట్లో ఈ ఫిర్యాదులను ఢిల్లీ పెద్దలు పెద్దగా పట్టించుకోకపోయినా.. దశాబ్దాలుగా పార్టీని నమ్ముకుని ఉన్న సీనియర్ నేతలు తమ ఆవేదనను వెళ్లగక్కడంతో ఢిల్లీ పెద్దల్లో ఆలోచన మొదలైందని సమాచారం. అందుకే రేవంత్‌రెడ్డి ఎన్నిసార్లు ఢిల్లీకి వెళ్లినా మంత్రివర్గ విస్తరణ, ఇతర పదవుల నియామకాన్ని పక్కన పెట్టినట్టు చెప్పుకొంటున్నారు. మరోవైపు అసంబద్ధ నిర్ణయాలతో కొంతకాలానికే ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత పెరగడంపై అధిష్ఠానం గుర్రుగా ఉన్నదని సమాచారం. కనీసం ధైర్యంగా స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లలేని స్థితిపై ఢిల్లీ పెద్దలు ఆగ్రహంతో ఉన్నట్టు తెలిసింది. ఏకంగా 10 మంది ఎమ్మెల్యేలు ప్రత్యేకంగా సమావేశమై ప్రభుత్వంపై తిరుగుబాటు చేసేలా చర్చలు జరపడంపై అధిష్ఠానం షాక్‌కు గురైనట్టు కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. ఈ పరిణామాలకు దారితీసిన కారణాలపై లోతుగా విశ్లేషించినట్టు సమాచారం. సీఎం ఒంటెత్తు పోకడల వల్లే ఈ పరిస్థితి వచ్చినట్టు నివేదిక అందిందని తెలిసింది. రేవంత్‌పై కొందరు నేతలు బహిరంగంగా విమర్శలు చేయడం సైతం అధిష్ఠానం దృష్టికి వెళ్లినట్టు తెలిసింది. అధిష్ఠానానికి తెలియకుండానే హైడ్రా ఏర్పాటు వంటి నిర్ణయాలను తీసుకున్నారని ప్రచారం జరుగుతున్నది. మంత్రుల మధ్య సఖ్యత సాధించడంలోనూ రేవంత్ విఫలమయ్యారని అధిష్ఠానం భావిస్తున్నట్టు సమాచారం. ఈ నేపథ్యంలోనే రేవంత్‌కు చెక్ పెట్టేందుకు రాహుల్ మీనాక్షి ని రంగంలోకి దింపారని చర్చించుకుంటున్నారు.

దీపాదాస్ పై ఆరోపణలు..

కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జిగా పనిచేసిన దీపాదాస్ మున్షీపై అనేక ఆరోపణలు వెల్లువెత్తిన సంగతి తెలిసిందే. ముఖ్యంగా సీఎం రేవంత్‌రెడ్డితో చేతులు కలిపారని, దీంతో ఆమె రాష్ట్ర వ్యవహారాల్లో పెద్దగా జోక్యం చేసుకోవడం లేదన్న ఫిర్యాదులు ఢిల్లీకి అందినట్టు సమాచారం. దీంతో అటు ప్రభుత్వపరంగా ఇటు పార్టీపరంగా రేవంత్‌రెడ్డి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని సీనియర్ నేతలు అధిష్ఠానానికి ఫిర్యాదు చేసినట్టు సమాచారం. ఈ నేపథ్యంలోనే దీపాదాస్‌ను తప్పించినట్టు చెప్పుకుంటున్నారు. ఇప్పటికైనా రేవంత్‌రెడ్డి తన వ్యవహార శైలి మార్చుకోకపోతే భవిష్యత్తులో పరిణామాలు తీవ్రంగా ఉండే అవకాశం ఉన్నదని గుసగుసలు వినిపిస్తున్నాయి.

ఐదో సీటు ఎవరికో?

- శాసనసభ్యుల కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉత్కంఠ
- ఇప్పటివరకు ఏకగ్రీవాలే, తొలిసారి ఎన్నికలు జరిగే అవకాశం
- కాంగ్రెస్‌కు మూడు.. బీఆర్ఎస్‌కు ఒక ఎమ్మెల్సీ గ్యారెంటీ
- ఐదో సీటు ఎవరికి దక్కుతుందనే దానిపై మారుతున్న అంచనాలు

హైదరాబాద్, ఫిబ్రవరి 28 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల విషయంలో ఆసక్తికరమైన చర్చ సాగుతున్నది. ప్రస్తుతం శాసనసభలో పార్టీల బలాబలాలను పరిశీలిస్తే కాంగ్రెస్ పార్టీకి 3, బీఆర్ఎస్ పార్టీకి ఒకటి చొప్పున మొత్తం నాలుగు స్థానాల విషయంలో స్పష్టత నెలకొన్నది. ఇక మిగిలిన ఐదో సీటు ఎవరికి దక్కుతుందనేది ఆసక్తికరంగా మారింది. శాసనసభ్యుల కోటా ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి మార్చి 3వ తేదీన నామినేషన్ల స్వీకరణ మొదలై మార్చి 10వ తేదీ వరకు కొనసాగనున్నాయి. రాష్ట్రంలోని 119 మంది ఎమ్మెల్యేలు ఐదుగురిని ఎమ్మెల్సీలుగా ఎన్నుకోనున్నారు.

ఈసారి ఎన్నిక తప్పదా?

తెలంగాణ శాసనమండలికి ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీల ఎన్నిక విషయంలో ఇప్పటివరకు పోలింగ్ జరగలేదు. తెలంగాణ తొలి శాసనసభ కొలువుదీరినప్పటి నుంచి ఎమ్మెల్యే కోటా ఎన్నిక విషయంలో పోలింగ్ జరిగిన దాఖలా లేదు. ఈసారి రాష్ట్రంలో నెలకొన్న రాజకీయ పరిస్థితులు, శాసనసభలో పార్టీల బలాబలాలు చూస్తే ఎన్నిక తప్పదనే వాతావరణం నెలకొన్నదని రాజకీయవర్గాలు అంటున్నాయి. నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగిసే సమయానికి (మార్చి 13వ తేదీ) ఐదు కన్నా ఒక్క నామినేషన్ ఎక్కువ దాఖలైనా పోలింగ్ అనివార్యమవుతుంది. తెలంగాణ శాసనమండలికి ఇప్పటి వరకు ఏకగ్రీవంగానే సభ్యులు ఎన్నికవుతూ వచ్చారు. ఈసారి అందుకు భిన్నమైన వాతావరణం నెలకొనే సూచనలు కనిపిస్తున్నాయి.

ఒక ఎమ్మెల్సీకి 21 మంది ఎమ్మెల్యేలు

నిష్పత్తి ఆధారిత దామాషా ప్రకారం ప్రాతినిధ్య ఓటు బదిలీ విధానంలో ఎమ్మెల్యే ఓటును లెక్కిస్తారు. ఈ లెక్కన రాష్ట్ర శాసనసభలో ఉన్న మొత్తం 119 మంది ఎమ్మెలేలు ఉన్నారు. ప్రజాప్రాతినిధ్య చట్టం, నిర్దేశిత ఓటు బదిలీ లెక్కల ప్రకారం ఒక ఎమ్మెల్సీ అభ్యర్థి గెలుపు కోసం ఒక్కో ఎమ్మెల్యే కోటా ఓటు విలువ 20.833 అంటే 21 మంది ఎమ్మెల్యేలు అవసరం. ఒక ఎమ్మెల్సీ అభ్యర్థి గెలవటానికి ఆ అభ్యర్థికి 21 మంది ఎమ్మెల్యేల ఓట్లు వేయాలి. ఏ రాజకీయ పార్టీ అయినా లేదా సభ్యుడు అయినా పోలింగ్‌కు దూరంగా ఉంటే ఓటు బదలాయింపు విలువ మారుతుంది.

ఐదో సీటు ఎవరికో?

రాష్ట్ర శాసనసభలో ప్రస్తుతం అసెంబ్లీ సభ్యుల సంఖ్య, నైష్పత్తిక ప్రాతినిధ్య ఓటు బదిలీ విధానంలో ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం గణిస్తే ఒక్కో ఎమ్మెల్సీ అభ్యర్థికి 21 మంది ఎమ్మెల్యేలు ఓటు వేయాలి. ఈ నేపథ్యంలో కాంగ్రెస్‌కు సొంతంగా మూడు స్థానాలు, బీఆర్ఎస్‌కు ఒక ఎమ్మెల్సీ స్థానం గ్యారెంటీ. అయితే, కాంగ్రెస్ మిత్రపక్షాలైన ఎంఐఎం, సీపీఐ తమ తమ అభ్యర్థులను రంగంలోకి దింపేందుకు సిద్ధమవుతున్నట్టు ఆ పార్టీలు సాగిస్తున్న మంతనాలను బట్టి స్పష్టమవుతున్నది. ఒకవేళ అదే నిజమైతే తన 65 మంది ఎమ్మెల్యేల్లో ఎంతమంది తమవైపు నిలబడతారు? అని కాంగ్రెస్ పార్టీ మల్లగుల్లాలు పడుతున్నది. దీంతోపాటు ఫిరాయింపు ఎమ్మెల్యేలను నమ్ముకుంటే ఏ మేరకు లాభం? తమ పార్టీలో ఉన్న అసంతృప్తి ఎమ్మెల్యేలకు తోడు ఫిరాయింపు ఎమ్మెల్యేలు ప్లేటు పిరాయిస్తే కాంగ్రెస్‌కు ఖాయంగా వస్తాయనుకున్న 3 సీట్లు కూడా దక్కుతాయో లేదో అన్న అనుమానాలు ఉన్నాయని ఆ పార్టీ వర్గాల్లో చర్చ సాగుతున్నది. ఇక బీఆర్ఎస్‌కు నికరంగా ఉన్న 28 మంది ఎమ్మెల్యేలకు తోడు ఆ 10 మంది ఫిరాయింపు ఎమ్మెల్యేలనూ కలిపితే 38 మంది. ఈ సంఖ్య ఆధారంగా బీఆర్ఎస్ ఇద్దరు అభ్యర్థులను నిలిపితే కాంగ్రెస్ ఆశలకు గండిపడటం పక్కా అని రాజకీయ వర్గాలు విశ్లేషకులు అంటున్నారు. రాష్ట్రంలో నెలకొన్న ప్రజావ్యతిరేకత, రాజకీయ వాతావరణం, కాంగ్రెస్ ఎమ్మెల్యేల్లో అసమ్మతి, ఫిరాయింపు ఎమ్మెల్యేల్లో మారుతున్న 'మనసు'.. ఆ ఐదోసీటును ప్రభావితం చేయవచ్చని వారు విశ్లేషిస్తున్నారు.

మరో రైతు ఆత్మహత్య

- దిగుబడులు రాక.. పెట్టుబడులు భారమై
- భూపాలపల్లి జిల్లాలో అన్నదాత బలవన్మరణం

రవి(ఫైల్)

రేగొండ, ఫిబ్రవరి 28 : దిగుబడులు రాక.. పెట్టుబడులు భారమై జయశంకర్ భూపాలపల్లి జిల్లా గోరికొత్తపల్లి మండలం వెంకటేశ్వర్లుపల్లె గ్రామంలో అప్పుల బాధతో మిర్చి రైతు గురువారం ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలిలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన బండారు రవి (54) తనకున్న రెండెకరాల భూమిలో మిర్చి పంటను సాగు చేశాడు. పంటకు నల్లితెగులు రావడంతో అధిక మొత్తంలో పెట్టుబడి పెట్టి పురుగుల మందులు కొట్టాడు. మిర్చి పంట పేరు మీద రూ. 4 లక్షలు ఖర్చు చేశాడు. పెట్టిన పెట్టుబడి సైతం వచ్చే పరిస్థితి లేక పోవడంతోపాటు గతంలో మిర్చి పంట నిమిత్తం చేసిన మరో రూ. 5 లక్షల అప్పు ఎలా కట్టాలో తెలియక మనస్తాపానికి గురయ్యాడు. ఈ క్రమంలో గురువారం పంటచేను వద్దకు వెళ్లి అక్కడే ఉన్న గడ్డిమందు తాగాడు. గమనించిన తోటి రైతులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా రవిని చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎం దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ అదేరోజు సాయంత్రం మృతి చెందాడు.

మానసిక ఒత్తిడితో కండక్టర్ ఆత్మహత్య

- రంగారెడ్డి జిల్లా గాండ్లగూడలో ఘటన
- కరీంనగర్‌లో మరో డ్రైవర్ ఆత్మహత్యాయత్నం

అంజయ్య (ఫైల్)

యాచారం/కరీంనగర్ తెలంగాణచౌక్, ఫిబ్రవరి 28: మానసిక ఒత్తిడి తట్టుకోలేక ఓ ఆర్టీసీ కండక్టర్ పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా యాచారం పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఉదయం చోటుచేసుకున్నది. సీఐ నందీశ్వర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. యాచారం మండలం గాండ్లగూడకు చెందిన కోరె అంజయ్య (55) ఇబ్రహీంపట్నం డిపోలో కండక్టర్‌గా పనిచేస్తున్నాడు. కొంతకాలంగా అతను వ్యక్తిగత కారణాలతో మానసికంగా ఒత్తిడికి గురవుతున్నాడు. దీంతో జీవితంపై విరక్తి చెందిన ఆయన పదిహేను రోజుల క్రితమే పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. స్థానికులు, కుటుంబ సభ్యులు నగరంలోని దవాఖానకు తరలించి సకాలంలో చికిత్స అందించడంతో కోలుకున్నాడు. మళ్లీ గురువారం సాయంత్రం గడ్డి మందు తాగాడు. గుర్తించిన స్థానికులు, కుటుంబ సభ్యులు హుటాహుటిన వనస్థలిపురంలోని ఓ ప్రైవేటు దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతున్న అంజయ్య పరిస్థితి విషమించడంతో మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ నందీశ్వర్ రెడ్డి పేర్కొన్నారు.

డ్యూటీ వేస్తలేరని డ్రైవర్ ఆత్మహత్యాయత్నం

డ్రైవర్ సురేశ్

కరీంనగర్-1 డిపో ఎదుట అద్దె బస్సు డ్రైవర్ శుక్రవారం ఆత్మహత్యకు యత్నించాడు. డబ్బాలో తెచ్చుకున్న పెట్రోల్ పోసుకుంటుండగా గమనించిన సెక్యూరిటీ సిబ్బంది నీళ్లు పోసి కాపాడారు. కరీంనగర్ జిల్లా చొప్పదండి మండలానికి చెందిన సురేశ్ అద్దె బస్సు డ్రైవర్. అనంతపల్లి రూట్ పల్లె వెలుగు బస్సు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. గత సెప్టెంబర్ నెలలో డ్యూటీకి వచ్చిన సురేశ్‌ను రోజువారి తనిఖీలో భాగంగా బ్రీత్ ఎనలైజ్ టెస్టు చేయగా 93 శాతం వచ్చింది. ఆర్టీసీ నింబంధనల ప్రకారం డ్యూటీ ఇవ్వకుండా పక్కకు పెట్టారు. డ్యూటీలో చేర్చుకోవాలని అధికారులను వేడుకోగా నివేదిక రాకపోవడంతో అధికారులు డ్యూటీ ఇవ్వలేదు. దీంతో జీతం రాక సురేశ్ ఆరునెలలుగా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు కార్మిక సంఘం నాయకులు తెలిపారు. మనోవేదనకు గురైన సురేశ్ కరీంనగర్ డిపో-1 ఎదుట ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యకు యత్నించినట్టు వారు పేర్కొన్నారు.

దర్జాగా దారిదోపిడీ

- టోల్‌చార్జీ పేరిట అక్రమ వసూలు
- మానేరు వాగుపై ప్రైవేట్ వ్యక్తుల దందా
- మంత్రి ఇలాకాలో వసూల్‌రాజాలు
- మండిపడుతున్న వాహనదారులు

ఒడేడు మానేరు వాగులో డబ్బులు వసూలు చేస్తున్న ప్రైవేట్ వ్యక్తులు

టేకుమట్ల, ఫిబ్రవరి 28: ప్రభుత్వాలతో ఒప్పందాలపై జాతీయ, రాష్ట్రీయ రహదారులపై టోల్‌గేట్లు ఏర్పాటు చేస్తుంటారు. రవాణా వాహనాల నుంచి నిర్ణీత మొత్తంలో నగదు వసూలు చేస్తుంటారు. దీనికి రోడ్డు నిర్మాణంలో భాగస్వాములైన సంస్థలకు నిబంధనల మేరకు నగదు వసూలుకు హక్కులు కల్పిస్తారు. అలాంటి టోల్‌గేట్‌ను పోలినట్టే ఏర్పాటు చేసి ఓ ముఠా దర్జాగా వాహనాల నుంచి అక్రమ వసూళ్లకు దిగింది. కాకుంటే వాగులో మట్టిపోసి ముక్కుపిండి వసూళ్లకు పాల్పడుతున్నది. ఉమ్మడి వరంగల్, ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాలతో మహారాష్ట్రను అనుసంధానం చేసే అంతర్ జిల్లాల సరిహద్దులో ఉన్న మానేరు వాగుపై అనుమతి లేకుండా కొంతమంది ప్రైవేట్ వ్యక్తులు దర్జాగా ఇలా దారి దోపిడీ చేస్తున్నారు. అరకొరగా మట్టి పోసి డబ్బు దండుకుంటున్నారు. భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం కలికోటపల్లి-పెద్దపల్లి జిల్లా ఒడేడు మధ్య మానేరు వాగు ఉన్నది. ఆ వాగులో కొందరు వ్యక్తులు ముఠాగా ఏర్పడి మట్టి రోడ్డు పోసి టోల్‌చార్జి పేరిట వాహనదారుల నుంచి అక్రమంగా డబ్బు వసూలు చేస్తున్నారు. ఒక్కొక్క వాహనానికి రూ.30 నుంచి రూ.500 వరకు తీసుకుంటున్నారు. ఎండోమెంట్‌కు సంబంధం లేని గుడి పేరున ఈ దందా చేపడుతున్నారు.

బీఆర్ఎస్ హయాంలో వంతెన పనులు

మానేరు వాగుపై వంతెన నిర్మాణం కోసం గత బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.50 కోట్లు కేటాయించి పనులు ప్రారంభించినప్పటికీ కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో కొంత మేర జరిగి నిలిచిపోయాయి. ఆనాడు ఉచిత రవాణా సౌకర్యమే ఉండేది. ఇది వసూల్ రాజాలకు వరంగా మారింది. ఈ క్రమంలో కాంట్రాక్టర్ వంతెన పనులు వెంటనే మొదలుపెట్టాలని డిమాండ్ చేస్తూ టేకుమట్లలోని ప్రజాసంఘాల నాయకులు మానేరు వంతెన నిర్మాణ సాధన కమిటీని ఏర్పాటు చేసి హైకోర్టును ఆశ్రయించారు. కానీ ఇంత జరుగుతున్నా ప్రభుత్వం, అధికారులు స్పందించకపోవడంపై ప్రయాణికులు మండిపడుతున్నారు.

ప్రజాప్రభుత్వంలో ప్రైవేట్ వ్యక్తుల దందా?

ప్రజాప్రభుత్వం అంటూ ప్రైవేట్ వ్యక్తుల దందా ఏంటి? మంత్రి నియోజకవర్గంలోని సరిహద్దు ప్రాంతంలో ఇలా జరగడం బాధాకరం. రోజూ వందల సంఖ్యలో వాహనదారులు దుమ్ము రోడ్డుపై ప్రయాణం చేసి డబ్బు కట్టి ఆర్థికంగా నష్టపోతున్నారు. వసూళ్ల వల్ల ఆర్టీసీ బస్సులు నడవడమే లేదు. మంత్రి శ్రీధర్ బాబు, ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు చొరవ తీసుకొని వంతెన పనులు ప్రారంభించి, రోడ్డుపోసి రవాణా సౌకర్యం కల్పించాలి. ఆర్టీసీ బస్సులను నడపాలి.

– నేరెళ్ల రామకృష్ణ, బీఆర్ఎస్ కార్మిక శాఖ టేకుమట్ల మండల అధ్యక్షుడు

ముందు ఓటు.. వెనక వేటు!

మొదటిపేజీ తరువాయి...

నాయకులు తమ ఫొటోలను వారి పార్టీ ఫ్లెక్సీల్లో పెట్టుకుంటున్నారని, తమను అభాసుపాలు చేస్తున్నారని నమ్మబలుకుతున్నారు. ఇదే విషయమై గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్‌రెడ్డి ఏకంగా పోలీస్‌స్టేషన్‌లోనే ఫిర్యాదు చేశారు. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ తన అభిమాన నాయకులైన వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, కేసీఆర్ ఫొటోలు తన ఇంట్లో పెట్టుకున్నామని చెప్పేశారు. కాంగ్రెస్‌లో చేరి పీఏసీ చైర్మన్ పదవిని దక్కించుకున్న శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ తాను పార్టీ మారనేలేదంటూ సందర్భం వచ్చిన ప్రతీసారి చెప్పుకొని తిరుగుతున్నారు. పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ఇప్పటికీ తన క్యాంప్ కార్యాలయంలో కేసీఆర్ ఫొటోను తొలగించకపోవడంతో స్థానిక కాంగ్రెస్ నాయకులు కార్యాలయంపై దాడిచేసి కేసీఆర్ చిత్రపటాన్ని తొలగించిన విషయం తెలిసిందే. ఈ పరిణామాల నేపథ్యంలో ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఈ 10 మంది ఎమ్మెల్యేలు ఎటువైపు ఉంటారు? అనేది చర్చనీయాంశంగా మారింది.

అగమ్యగోచరంగా గోడదూకిన ఎమ్మెల్యేల రాజకీయ భవిత

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎటువైపు ఉండాలి అనే విషయంలో గోడ దూకిన ఎమ్మెల్యేలు తర్జనభర్జన పడుతున్నారు. అధికారికంగా పార్టీ మారి పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసిన ఎమ్మెల్యే దానం నాగేందర్, బీఆర్ఎస్ శాసనసభాపక్షం నియమించకపోయినా, ఏ బీఆర్ఎస్ ఎమ్మెల్యే ప్రతిపాదించకపోయినా కాంగ్రెస్‌లో చేరటం వల్ల పీఏసీ చైర్మన్ పదవిని పొందిన అరికెపూడి గాంధీ సహా కాంగ్రెస్‌లోకి వెళ్లిన కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావ్, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, సంజయ్‌కుమార్, కాలె యాదయ్య, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, ప్రకాశ్‌గౌడ్, గూడెం మహిపాల్ రెడ్డి.. ఈ 10 మంది ఎమ్మెల్యేల మెడపై 'అనర్హత' కత్తి వేలాడుతున్న విషయం తెలిసిందే. అయితే, ఈ క్రమంలో తాము కాంగ్రెస్ అభ్యర్థికి అనుకూలంగా ఓటు వేస్తే అనర్హత ముప్పు మరింత వేగంగా తలుపు తట్టే ప్రమాదం ఉన్నదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. విప్‌కు అనుగుణంగా ఎమ్మెల్యేలు నడుచుకోవాల్సి ఉంటుంది. అయితే, ఎన్నికల సందర్భంగా విప్ జారీ చేసినా రహస్య ఓటింగ్ జరుగుతుంది కనుక తప్పించుకోవచ్చని భావిస్తే కుదరదని, ఫిరాయించిన ఎమ్మెల్యేలు ఓటు ఎటు వేశారనేది తెలిసిపోతుందని నిపుణులు పేర్కొంటున్నారు. అప్పుడు పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని సుప్రీంకోర్టులో న్యాయపోరాటం చేస్తున్న బీఆర్ఎస